# మింగుతున్న పట్నం

ముదిగంటి సుజాతారెడ్డి

**రోడ్డు ఊరికి ఎంతో దూరంలో లేదు. రోడ్డు మీద బర్రుబర్రుమని పోతున్న కార్ల మోతలు ఎడతెగ కుండా వినిపిస్తున్నాయి. పొట్టి కార్లు పొడుగాటి కార్లు నల్లనివి తెల్లనివి ఎర్రనివి ఎన్నో రంగుల్లో మిలమిలా మెరుస్తూ వేగంగా పరి గెత్తుతున్నాయి. రోడ్డు పొడుగునా రోడ్డును విభజిస్తూ నడుమ వరు సగా ఎత్తైన స్తంభాలకు లైట్లు వేలాడుతున్నాయి. స్తంభాలకు మధ్యమధ్యన రంగురంగుల పూలతో రకరకాల ఆకారాల రంగుల ఆకులతో వున్న మొక్కలు వున్నాయి. అవన్నీ మనదేశం మొక్కల్లాగా లేవు. ఎత్తైన స్తంభాల నుంచి వేలాడే పెద్దపెద్ద లైట్ల వెలుగులో రోడ్డు జెర్రిపోతులా మిలమిలా మెరుస్తున్నది.**

ఆ విశాలమైన రోడ్డుకు కొంత దూరంలో తాటాకు గుడిసె వుంది. ఊరికి బయటవుంది ఆ గుడిసె. అది చిన్న పల్లెటూరు. పేరు కొండపాక. ఊరి మధ్యలో కొన్ని పెంకుడిండ్లు వున్నాయి. ఊరి బయట అన్నీ గుడిసెలే. వాటిల్లో ముత్తమ్మ గుడిసె పూర్తిగా ఊరి చివరన వుంది. గుడిసెకు దూరంగా కాక్టసు పొదలు సాలుగా వున్నాయి. ఒకప్పుడు ఆ కాక్టసు వరస చెల్కకు సరిహద్దుగా వుండేది. కాక్టసు ముండ్లు వాడిగా పైకిలేచి వున్నాయి. ఎర్రని మొగ్గల్లాంటి పండ్లు లైట్ల వెలుగులో మరింత ఎర్రగా కన్పిస్తున్నాయి.



గుడిసె వాకిట్లో రోలు ముందల చతికిలబడి ఏకాగ్రతతో ముత్తమ్మ మిరపకాయల కారం నూరుతున్నది. ఆమె ముఖం నెత్తి దుమ్ము కొట్టుకపోయి వున్నాయి. దుమ్ములో పుట్టి దుమ్ములో పెరిగినదానిలా వుంది. ఆమె ముఖం చిన్నబోయి వుంది. చిన్నబోయిన ముఖం మీద భయాందోళనలు కన్పిస్తున్నాయి. అప్పుడప్పుడు ఆమె ముఖంలో ప్రశాంతత చోటుచేసుకుంటున్నది. ఆమె పుల్లల్లాంటి చేతుల్లో రోకలిబండ వేగంగా తిరగడంలేదు. ముత్తమ్మ తొందరగా కారం నూరాలని రోకలిబండను ఒకచేతి నుంచి మరో చేతికి మారుస్తున్నది. రోకలిబండతో ఆమె అటుయిటు ఊగుతున్నది. అయినా రోకలిబండ రోట్లో వేగంగా తిరగడమేలేదు. టక్కటక్కమని రోలు పక్కలకు తగులుతున్నది. అసలు నూరడానికి ముత్తమ్మకు చేతులు కదలడమేలేదు. భుజంమటుకే వేలాడుతున్న చినిగిన పైటకొంగుతో పైకి ఉబికివస్తున్న కన్నీళ్ళను మాటిమాటికి తుడుచుకుంటున్నది ముత్తమ్మ.

భర్త సమ్మయ్య చచ్చినప్పుడైనా ముత్తమ్మకు ఇంత దుఃఖం రాలేదు. ఏరోజు దొరికిన కూలి పైసలతో ఆరోజే తాగి వచ్చేవాడు సమ్మయ్య.

"ఆడు మొదట్ల గట్లలేడు. ఎట్లట్ల కష్టాలు ఎక్కువైనయొ ఆని తాగుడు గట్లనె ఎక్కువైంది. ఇటుకలు రాళ్ళు మోసిమోసి ఆని ఈపు మొదట్ల వుండయింది. గటెనుక మొద్దుబారింది. నాచేతులో!- కంకర మోసిమోసిగా రాళ్ళ లెక్కనె అయినయి. కంకరలో సిమెంటులో నడిచినడిచి కాళ్ళు కట్టెల లెక్కనె అయినయి. కష్టానికి ఉప్పస తాగుడు అయింది గట్ల. ఆడు కల్లు కంపౌండు దగ్గర తాగి ఓ కల్లు సీస ఎప్పుడైన నాకు పట్టుకొచ్చెడోడు. రానురాను కూలి పైసలన్ని కల్లుకే పెట్టుడు మొదలుపెట్టిండు. దాంతోటి ఇంట్లలొల్లి మొదలైంది. పోరలేం అంటరు- పోరలెట్ల బతుకుతరని నేను మొత్తుకున్న ఆ౦ప పట్టిచ్చుకోలేదు. సమ్మయ్య తనేందొ- తన ఎవసాయం పనేందొ గాని ఒగరి ముచ్చెటకు ఒగరి తెరువుకు పొయ్యెటోడు కాదని పేరు తెచ్చుకున్నోడు గట్ల అయిపోయిండు! ఇగ ఒగనాడు- రెండేండ్ల కింద - గయ్యాలగా మాయ కల్లుతో ఏం కలి పింద్రొ ఏందొ - ఆడు కల్లు కంపౌండ్ల తాగి చేతిలొ - శాన రోజులకు మతి ఎట్లయిందొయేమొ- కల్లు సీస తోటి గుడిసె కొచ్చిండు. ఒచ్చుడు ఒచ్చుడె నోట్లె నుంచి నురుగులు గక్కుకుంట పడిపోయిండు. చేతులున్న కల్లుసీస కిందపడి ముక్కలయింది. నేలమీదపడ్డ కల్లు బుసబుసమని పొంగింది. ఆడు కట్టె సరుసుక పడిపోయినోడు మల్ల లేవలేదు. మాటమంతి లేకుంటనె ప్యానాలు పోయినయి. మాటమంతికి ఏమన్న బూములు ఆస్తులు యవ్వారాలు వున్నయ ఏమన్నన?- గదంత చూసి ముగ్గురు పోరలు సంటోడు కోడిపిల్లల్లెక్క నా సుట్టు చేరింద్రు. బిక్కుబిక్కుమని చూస్తున్నగా పిల్లల ఆకలే నాకు యాదికున్నదిగాని ఆని ప్యానాలు పోయినయేయని అంతగనం దుఃఖం రాలేదు. గదేందొ గట్ల కండ్లపొంటి సుక్కనీరు కారలేదు!"

ముత్తమ్మకు భర్త మరణించిన ఆనాటి దృశ్యమంతా కండ్లముందు మెదిలి ఈ రోజు దుఃఖం పెల్లుబికింది. చేతిలోని రోకలిబండను రోలుకానించి రెండు చేతుల్తో కొంగును కండ్లకడ్డం పెట్టుకొని పెద్దగా శోకం పెట్టి ఏడ్చింది ముత్తమ్మ. రోడుమీది కార్ల మోతలతో ఆమె ఏడ్పు ఎక్కువ దూరం ఎవరికీ వినిపించలేదు. గుడిసెలో పొయ్యిముందల కూర్చొని పొయ్యిలోకి కట్టెపుల్లలు విసురుతున్న ముత్తమ్మ కూతురు సరమ్మకు తల్లి ఏడ్పు వినిపించింది. పొయ్యి దగ్గరే కూర్చున్న తమ్ముని చంకలో ఎత్తుకొని గుడిసె బయటికి వచ్చింది. సరమ్మ పదేండ్లదయినా ఎనిమిదేండ్లదానిలా కన్పిస్తుంది. శోకం పెట్టి ఏడుస్తున్న తల్లిని చూస్తె ఏం చేయాలో దానికి తోచలేదు. ఏడుస్తూ తల్లి పక్కన తమ్మునితో కూలబడ్డది. సరమ్మ ఏడ్వడం చూసి ముత్తమ్మ తన శోకాన్ని ఆపింది.

"ఏంది బిడ్డ! తమ్ముండ్లు ఏరి?" అని అడిగింది.

"నిద్రపోతున్నరు-" అంది సరమ్మ వెక్కివెక్కి ఏడుస్తూ. ఆమె చింపిరి వెంట్రుకలు నూనెలేక ఎర్రబడి అక్కడక్కడ జడలు కట్టాయి. చాలీచాలని లంగాజాకెట్టులోంచి పొట్ట బాగా పైకిలేచి కన్పిస్తున్నది. కను గుడ్లు పెద్దగా పైకి వుబికి వున్నాయి. కాళ్ళుచేతులు బొక్కలుతోలు మాత్రం మిగిలివున్నాయి. దాని పక్కన కూర్చున్న తమ్ముడు అట్లానే వున్నాడు.

ముత్తమ్మ కనీళ్ళు తుడ్చుకొని

"పద బిడ్డ! లోపలికి పా! గీకారం అయింది. ఎత్తుకొని ఒస్త. పొయ్యిమీద అన్నం వుడికిందేమొ చూసి కట్టె పుల్లలు గుంజెయ్యి. అన్నం మాడ్తది జర్రపోయి సూడు బిడ్డ!" అంది.

సరమ్మ తమ్మున్ని ఎత్తుకొని మెల్లగా గుడిసెలోకి పోయింది. ముత్తమ్మకారం చిప్పలోకి ఎత్తింది. సొట్టలు పడ్డ రాతెండి గిన్నెలోంచి ఇన్నన్ని నీళ్ళు రోట్లోపోసి ఆ నీళ్ళలో రోకలి బండను కడిగింది. ఆ కారం నీళ్ళను కూడ చిప్పలోకి ఎత్తింది. "కారంలో ఏద్దమంటె ఇంట్ల ఉల్లిగడ్డ గూడ లేదు. గింతంత ఉప్పుగల్లు ఏసి నూరిన. అయిన ఏదైతె ఏంది గిప్పుడు!" నిట్టూర్పు విడిచింది ముత్తమ్మ. కండ్లనుంచి కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి. రోడ్డుమీద ఖరీదైన కార్లు ఎడతెరపి లేకుండ పరిగెత్తుతున్నాయి. ఆ కార్ల హెడ్‌లైట్ల వెలుగులు దూరంనుంచి సాగుతున్న వెలుగు కడ్డీల్లా కన్పిస్తున్నాయి. ఆ వెలుగులకు ముత్తమ్మ కళ్ళు మూసుకపోయాయి. ముఖం తిప్పు కొని గుడిసె వైపు చూసింది. గుడిసెలో గ్యాసునూనె దీపం గుడ్డిగా వెలుగుతున్నది.

"నాకు పెండ్లయి కొత్తగ ఒచ్చినప్పుడు గీ గుడిసె అలుకు పూతలతో ఎంత మంచిగనిపించింది! మా అత్త కొడుకు పెండ్లికని ఎర్రమట్టిపెట్టి గోడలన్ని పూసింది. గుడిసె సుట్టువున్న గోడను కూడ ఎర్రమట్టితో పూసి కొత్త గోడలెక్క చేసింది. ఎర్రటి గోడలకు తెల్లటి సున్నంతో పట్టెలు పెట్టింది. వాకిలికి అటుయిటు గోడలమీద సున్నంతో బొమ్మలేసింది. ఆ బొమ్మలు ఎంత ముద్దుగుండె! గుడిసె దాటి గటెటు పోతె పచ్చని పొలాలు చెల్కలు. ఎన్నో చింతచెట్లు తుమ్మచెట్లు వేపచెట్లు వుండేయి గిక్కడే. చింత కాయ పిందెల దగ్గర్నుంచి చింత పండు




అయ్యేదాకా ఏరి తెస్తే పప్పుల యేసేది- పులుసు చేసేది మా అత్త. అంత కన్న ముందల చింతపువ్వు!- చింత పువ్వును ఒంకాయల్ల ఎండిన చేపల్ల ఏసి ఒండితె ఎంత కమ్మగుండెదో! అగో గక్కడ్నె మా మామకు రెండెకరాల చెల్క వుండేది. జొన్నలు పెసల్లు పండేయి. ఒగయేడు ఏరుశనగ యేస్తె మస్తు పంట ఒచ్చింది. గాయెడే పట్నం నుంచి ఒచ్చి బూములు కొంటమన్నరు. గంతే! దబదబ ఊరోల్ల భూములన్ని అడ్డికి పావుసేరు లెక్క కొనుక్కుండ్రు. ఒగల్ని జూసి ఒగలు భూములమ్ము కుండ్రు. ఇష్టమున్న లేకున్న ఒగరు అమ్ముకున్నంత ఇంకొగరు అమ్ముకోక తప్ప లేదు. అన్ని పైసలిప్పస్తం ఇన్ని పైసలిప్పస్తం అని నడిమి ఆసాములు ఆగనిచ్చింద్ర ఎవల్నైన. దబ్బదబ్బ పైసలు చేతుల్ల పెట్టి పట్నమోల్లకు పట్టాలు చేయించింద్రు చణాల మీద. ఎవరన్న గట్లనె మా మామ లెక్క అమ్ముకోమంటె సర్కారోల్లు జప్తుసేసుకుంటరు- అప్పుడు పుణ్యానికి పోతయి భూములని సెప్పింద్రు. గదంత నిబద్దమె అను కొని మిగిలినోల్లు అమ్ముకుంద్రు. కొండపాకంత కొనేసు కుంద్రు. కార్లల్ల ఒచ్చినోల్లను చూసి మేము గట్లనె కార్లల్ల తిర్గుతమని బమిసింద్రు వయసులున్న పోరగాండ్లు! గిప్పుడేమైంది! ఎవసాయాలు పోయి తిండికి సాలని కూలి పైసలు సంపాయించె కూలీలైంద్రు! ఏంజేస్తరు! పట్నం మారాజులు ఒక్కొక్కరు ఒందలకొద్ది ఎకరాల భూములు కొనుక్కొన్నరు. ఇగ ఊరోల్లకెవలికి బూముల్లేకుంట అయినయి. భూములమ్మితె ఒచ్చిన పైసలు కొంత అప్పులకయి పోతె కొంత పోరల పెండ్లిండ్లకయినయి. కొంత పైస జల్సాలకయింది. గీ ఊరు మాత్రం మిగిలింది గిక్కడ!-" ఆలోచనలతో ముత్తమ్మ తనను తానే మరచిపోయింది కాస్సేపు. హఠాత్తుగా ఈలోకంలోకి వచ్చి రోడ్డువైపు చూసింది. రోడ్డుకు ఒకవైపు దూరంగా ధగధగమెరిసే భవంతి మీద ముత్తమ్మ దృష్టిపడింది.

"అగో! గామేడ- కట్టె దగ్గర్నె అందరం రాళ్ళు రప్పలు మోసె కూలీలమైనం. గామేడకు పోయెటందుకు మొదట్ల రోడ్డు సన్నగుండె. గిప్పుడు మూడింతలు ఎల్పయింది. గామేడ కట్టుడు అయినంక అందరం ఊరోల్లంగిరోడ్డు ఏసెటంద్కు కదిలినం. అమ్మొ! గామేడ కట్టె పనికి గీ రోడ్డు ఏసెటంద్కు శాన రోజులె పట్టినయి. గీ కూలిపని మొదలయ్యేటప్పటికి పెద్దది సరమ్మ పుట్టనెలేదు. దానికిప్పుడు పదేండ్లు లేవు! గంతె సరమ్మ పుట్టుకకు ముందు నుంచె- గప్పట్నుంచె కష్టాలు మొదలయినయి. భూమి అమ్మంగనె యేమైందొయేమొ యేడాది తిర్గకుంటనె అత్త మామలు ఒకరి ఎనుక ఒకరు సచ్చి సొర్గం పోయింద్రు. అనాది నుంచి భూమిని నమ్ముకున్న రైతులకెవలకు భూమి లేకుంట బోయింది. భూములు పోతె ఏమన్న సక్కంగ భూముల ధరలు ఒచ్చి బాగుపడ్డది లేదు. ఇగ గారందితోనె అత్తమామలు సచ్చిపోయింద్రు గావచ్చును! గంతె! సొసంత్రంగ బతికినోల్లు! ఒగరి ముందల సెయ్యి సాపనోల్లు! మా రాజుల్లెక్క బతికినోల్లు! మా రాజుల్లెక్కనె పోయింద్రు. గీ ముదనష్టపు రోజులు సూడక ముందల్నె పోయింద్రు. మంచిదె అయింది! గీ అన్నాలం సూడలేదు!

■ కథ

భూములమ్ముకున్నంక శానమందికి పొట్టకోసం మేడ కట్టె దగ్గర కూలిపనులు సేయక తప్పలేదు. కూలీలుగ తట్ట మోస్తుంటె గీ పనేంది అని సిగ్గయింది. మొదట్ల ఎట్లనొ అన్పించింది. ఇగ కంట్రాక్టరు నిలబడి- కదులుండ్రి!- ముండలకు పనిసేతకాకపోతె ఎందుకొస్తరు- అని తిడ్తుంటె సచ్చిపోదమనిపిచ్చింది. ఇగ గటెనుక మెల్ల మెల్లగ గదంత అలవాటయింది!" ముత్తమ్మ దిగులుగా వుంది. వెన్నెలలా వెలిగే లైట్ల వైపు ధగధగ అద్దాలతో మెరిసె మేడవైపు చూస్తుండిపోయింది. కళ్ళు పెద్దవిగా చేసుకొని.ఆమె మనస్సులో మళ్ళీ జ్ఞాపకాలు-

"ఆడు సచ్చినంక పిల్లల్లల్తో రెండేండ్ల నుంచి తిప్పలు పడ్తున్న. చిన్నోడు పుట్టి బాలెంతగున్నప్పుడె గద ఆడు సచ్చిపోయింది! గీ రెండేండ్లు రోడ్డు ఏసె దగ్గర కంకర మోసిన. రోడ్డు ఏసుడు అయినంక ఒక్కసారె కూలి పనుల్లేకుంట అయినయి. గా మేడకు మడుసులు ఒచ్చుడుపోవుడు ఎక్కువైంది గప్పట్నుంచి. నెరీ గీ నెలరోజుల్నుంచి నేను పోరలు ఉపాసాలె వుంటున్నం. గా మేడల శాన పనులున్నయి. శాన ఆఫీసులొచ్చినయి. పోయి అడుగు ఏదైన పని ఇప్పిస్తరు అని చెప్పింద్రు. దాంతోటి మేడకుపోయిన. ఒగప్పుడు నాగటిసాలు ఎంబడి ఉరుక్కుంటు ఇత్తనాలు యేవిన భూమిమీద గిప్పుడు కంకర సిమెంటు పరసుకొని పోయింది. మేడ సుట్టు పచ్చటి గడ్డి. రంగురంగుల పూలు గుత్తులుగుత్తులుగ. గా గడ్డిని నీల్లుపోసి పెంచుతున్నరు. గా గడ్డి గొడ్లకు పనికొస్తద ఏమన్నన? ఏ కాయలో పండ్లో కాసె చెట్లు పెడ్తె సరేగాని గా పూలతోటి కడుపునిండుతద? నా ఎడ్డిముకంగాని గా పూలను కడుపునిండిన మారాజులు సూసుకొని మురిసిపోయెటంద్కు పెట్టింద్రు గవన్ని! ఎప్పుడు పొట్టకు దేవులాడుకునెటోల్లకు ఏం సమఝయితయి! మేడలకు పోంగనె ఎక్కడ్నో దేవతల లోకంల

> కొడుకులను నిద్రనుంచి లేపి
> బలవంతంగ తీసుకొచ్చి అన్నం గిన్నెముందు
> కూర్చో బెట్టింది. అన్నం గిన్నెను చూసేసరికి వాళ్ళ
> నిద్రమత్తు వదిలింది. దబదబ పళ్ళాలు దగ్గరకు
> లాక్కున్నారు. వాళ్ళ ఆత్రం చూసేసరికి ముత్తమ్మ ఎద అంతా
> బరువైంది. ఆమె కండ్ల నుంచి కన్నీళ్ళు
> ఎడతెగకుండా కారుతున్నాయి.

అడుగుబెట్టినట్లనిపిచ్చింది. తెల్లగ పాలనురుగు లెక్క వున్న పాలరాయితో నేల అడుగు బెడితె ఎక్కడ మాసిపోతదొ అన్నట్లుగున్నది. అద్దాలు బొమ్మలతో లైట్లతో మేడ సొర్గం లెక్కున్నది. గదంత చూస్తె గుండె దడదడ కొట్టుకున్నది. గిది మేంగట్టిన మేడె గద! మేం ఇటుకలు రాల్లు సిమెంటు మోసుకుంట తిర్గిన జాగేగద!- గిప్పుడు లోపలికి పోతె గిట్ల గుబులుగ వుందేంది! అనుకుంటనె గుండె దిటం జేసుకొని ఆఫీసరు కాడికి అర్రలకు తలుపు తీసుకొని పోయిన. పోంగనె అర్రల సల్ల గుంది. ఒళ్ళు జిల్లుమన్నది. ఒగాయన ఏదొ మెషిను ముందల కూసున్నోడు- ఎవరు గావాలె?- అనుకుంట గిర్రున తిరిగె కుర్చిని తిప్పుకొని నా దిక్కు సూసిండు. నాకు మస్తుగ బయమైంది. నా చినిగి పేగులైన చీరను ఒంటికి దగ్గరగ గుంజుకున్న. ఆయన చెయ్యి పైకెత్తి నెత్తి ఎంటి కలు సవరిచ్చుకుండు. ఆయన చేతికున్న ఉంగరాలు గడియారం తళుక్కున మెరిసాయి. ఆయన కండ్లద్దాలు బంగారంతో జేసినయి. గవన్ని ఎన్ని లచ్చలు ఖరీదు జేస్తయొ! ఎవరు.గావాలమ్మ? ఎందుకొచినవ్? అని అడిగిండు. ఆయన గొంతునుబట్టి ఏందో శికాకుపడ్డట్లుగనిపిచ్చింది. అయిన దైర్యం జేసుకొని అయ్యా! దొర! ఏమైన పనుంటె ఇప్పిచ్చుండ్రి. పిల్లల్తో తిండికిలేక మలమల మాడ్తున్న- అని అన్న. అంతే! నువ్వేం పన్జేస్తవ్? గీ మెషిన్లను తుడిసెటందుకు మిషనుంది. గది నడుపొస్తద-అని అడిగుండు. ఆయన గట్ల అడిగె సర్కి పరేషానయిన. అయ్యా! దొర! గా మెషినుతోటి తుడుసుడు నాకురాదు గాని చీపురుతో ఊడుస్త గుడ్డతోటి తూడుస్తు గిదంత సాఫీగ వుంచుత- అని అన్న. ఆయన ఒక్కసారె పక్కున నవ్విండు. గిప్పుడు గా ఊడ్సుడు తూడ్సుడు గిక్కడ పనికిరాదు అన్నడు. అయ్యా! దొర! గదంత గాకపోతె ఏదైన పని ఇప్పిచ్చుండ్రి గరీబుదాన్ని- అని ఆయన కాల్లు పట్టుకోబోయిన. నీ అసొంటి పల్లెటూరోల్లకిక్కడ ఏం పనిలేదు. ఇక్కడ్నుంచి పో!- అని కసిరిండు. గంతే దబదబ బయటికి ఒచ్చిన. ఎక్కడ ఏం పని దొర్కలేదు.గీ నల్గురు పోరల్ను ఎట్ల సాదాలె?-అని శింత! ఉపాసాలతో ఎన్నాల్లుంటం. గందుకె వున్న మోసేయి ఎండికడెం- పెండ్లప్పుడు మా అత్తపెట్టింది- బద్రంగ గిన్నాల్లు పెట్టుకున్నదాన్ని అమ్మిన. బియ్యం మిరపకాయలు ఎల్కలమందు కొనుక్కొచ్చిన. ఇగ గిదే మాకు ఆఖరి అన్నం-"అనుకుంటు ముత్తమ్మ కారం చిప్పవైపు చూసింది.

"గీ గొడ్డు కారం పోరలు తింటరొ లేదొ?- ఎట్లయిన ఆల్ల కడుపుల్లోకి కుక్కాలె" ముత్తమ్మ గుడిసెలోకి పోయింది. కారం చిప్పను భద్రంగ కిందపెట్టి పొయ్యి మీదున్న అన్నం గిన్నెను దింపి చిప్ప పక్కన పెట్టింది. పిల్లలకు తనకు రాతెండి పళ్ళాలు తెచ్చిపెట్టింది.

"సరమ్మ! తమ్మున్ని తీస్కొని ఇటురావె" అంది ముత్తమ్మ. ఆమె పోయి పండుకున్న ఇద్దరు కొడుకులను నిద్రనుంచి లేపి బలవంతంగ తీసుకొచ్చి అన్నం గిన్నె ముందు కూర్చోబెట్టింది. అన్నం గిన్నెను చూసేసరికి వాళ్ళ నిద్రమత్తు వదిలింది. దబదబ పళ్ళాలు దగ్గరకు లాక్కున్నారు. వాళ్ళ ఆత్రం చూసేసరికి ముత్తమ్మ ఎద అంతా బరువైంది. ఆమె కండ్ల నుంచి కన్నీళ్ళు ఎడతెగకుండా కారుతున్నాయి. పిల్లలతో ఆమె కూర్చుంది. చిప్పలో వున్న కారం ఎర్రగా లేదు. పళ్ళెంలో తల్లి అన్నం మీద వేసిన కారం మట్టిరంగులో నల్లగా వుంది. సరమ్మ ఆ కారంవైపు చూసి

"అమ్మా! కారం గిట్లుందేందే!" అని అడిగింది.

"గింత చింతపండు ఏసిన్నే" అంది ముత్తమ్మ ఏడుపు నాపుకొని. చిప్పలోని కారం తీసి కొడుకుల పళ్ళాల్లో వేసి అన్నంతో కలిపింది ముత్తమ్మ. పిల్లలు ఆకలితో వున్నారు. దబదబా బుక్కలు నోట్లో పెట్టుకున్నారు. రుచి ఎట్లాగో వుంది. అన్నం ముద్దను ముక్కు దగ్గర పెట్టుకొని మురుక చూసి "అమ్మ! కారం గిట్ల వాసనొస్తుందేమె-" అని అడిగాడు ముత్తమ్మను పెద్దకొడుకు.

"కారానికేమైందిర! తిను. ఏంగాదు" అంది ముత్తమ్మ. ఆమె గొంతు ఎండుకొనిపోయి వుంది. ఏ భావంలేదు. ముగ్గురు పిల్లలు అన్నం నిశ్శబ్దంగా తింటున్నారు. ముత్తమ్మ తన ముందున్న పళ్ళెంలో నుంచి తాను తింటూ చిన్న కొడుక్కు తినిపించడం మొదలుపెట్టింది. కాస్సేపట్లో అన్నం గిన్నె ఖాళీ అయింది. అన్నం తినడం పూర్తికాగానే ముగ్గురు పిల్లలు "అమ్మ! నిద్ర ఒస్తుందె!" అని చినిగిన చాపలమీద ఒరిగిపోయారు. వెంటనే నిద్రలోకి జారుకున్నారు.

ముత్తమ్మ ఒడిలో వున్న చిన్నకొడుకు అన్నం తింటూ తింటూనే నిద్రపోయాడు. వాన్ని ముత్తమ్మ ముగ్గురు పిల్లల పక్కన పడుకోబెట్టింది. పడుకొని వున్న నలుగురు పిల్లలవైపు ఆమె కన్నార్పకుండా చూసింది. ఆమెకు నిద్రమత్తుతో కళ్ళు మూసుకపోతున్నాయి. పిల్లల పక్కనే నేల మీద ఒరిగిపోయింది.

మర్నాడు పత్రికల్లో "తల్లి నలుగురి పిల్లలతోసహా ఆత్మహత్య"- అన్న వార్త ఓ మూల పడింది. దాన్ని చదివినవాళ్ళు చదివారు. చదవనివాళ్ళు చదువలేదు. చదివిన వాళ్ళు "తల్లికి ఏం పుట్టిందని పిల్లల్ని చంపి తాను చచ్చింది!" అని అనుకున్నారు. కాని పెరుగుతున్న పట్నం వాళ్ళను మింగేసిందన్న సత్యం వాళ్ళెవరికి తెలియదు. ●